# ఉప్పు బొమ్మ

రాఘవ



కొండూరు దాటి ఉండి వచ్చేంతవరకూ గాలివాన విసురూ, చిటపట చినుకుల జడివాన ఉండీ ఉడిగీ వెంట ఉంటూనే ఉన్నాయి.

"ఈ ప్రయాణం ఏమిటే? ఎట్లా ఈ రెండెడ్ల బండితో ఇల్లు చేరటం?" అని ఆకాశం వంక కాసేపూ, తనెదురుగా ఉన్న మనవడి వంక కాసేపూ - దిక్కు తోచక బిక్కుబిక్కుమంటూ చూస్తూ కూర్చుంది నరసమ్మగారు.

కాటుక మేఘాలు కొన్ని తూలి తూలి పడుతూ పోతున్నాయి. మరికొన్ని తెలిమబ్బులు రాజపుటానా జాగీర్లు చీలినట్లు చీలుతూ నలువైపులకూ తోసుకుపోతున్నాయి. నరసమ్మగారు గాలివాన చేసిన బీభత్సానికి విస్తుపోతూ, బండి తోలుతున్న కోటయ్యను తొందరగా కొంపకి చేరేలాగ చూడమని హెచ్చరిక చేస్తూ ఉంది. ఇంతలో బండి ఉండిలో సంత జరిగే ప్రాంతం దాపుల కొచ్చింది. అంతవరకూ మసక వాతావరణాన్ని చూస్తున్న గోపీ జర్రున బండి తొట్లోకి జారుకుని రాదారి వైపు చూస్తూ ఆత్రుతగా-

"ఇదేనా బామ్మా, సంత జరిగే చోటు! ఇక్కడెక్కడో పెద్ద చెట్టు పడిందట, అడుక్కు తినేవాళ్లంతా చచ్చిపోయార్టకూడానూ! చూసొద్దామా, బామ్మా!" ఆశ్చర్యంతోపాటు కుతూహలాన్ని కూడా చూపడంతో నరసమ్మగారు ఉలిక్కిపడి -

"అది సరే గానీ, నీ కీ సంగతి ఎవరు చెప్పార్రా, నాన్నా!" గోముగా అడుగుతూ, గాలికి రేగిన సాదా జుట్టుని పైకి తోసింది.

"మన కోటిగాడు, బామ్మా!"

"ఎప్పుడ్రా?" నరసమ్మగారు గుర్తుకి రాకే అంది.

"బండి కట్టే ముందు, పొద్దున నీతో అంటంలా! అప్పుడు విన్నాను బామ్మా!"

"మా నాయనే! నీ కెంత జ్ఞాపకంరా ప్రతీదీను!" గోపీ తెలివితేటలకు మురిసి పోయింది.

"అందుకని బామ్మా! మనమే ఆ సంతలోకి పోయి ఆ పడిన చెట్టునీ, చచ్చిన ఆ బిచ్చగాళ్లనీ చూసొద్దాం ఎలా ఉన్నారో?"


"వాళ్లెట్లా ఉంటే నీ కెందుగ్గానీ, ఇప్పుడటు వద్దులే!"

"ఎందుకని బామ్మా?"

"ఎందుకేమిటిరా? నువ్వు చూస్తే జడుసుకుంటావు. చిన్నవాడివి గదూ! అందుకని. చక్కగా మనం చెరువుగట్టు మీదుగా పోదాం అవీ ఇవీ చూసుకుంటూ ... ఏం?" గోపీ ఉత్సాహాన్ని తగ్గించటం కోసం అనసాగింది నరసమ్మగారు.

"అలా వీల్లేదు, బామ్మా! ఏమైనా సరే అక్కడికి వెళ్లాల్సిందే. మన ఊళ్లో మోట బావిలో పడి శకుంతలత్తయ్య చనిపోతే మనమంతా వెళ్లి చూసి ఏడ్చి రాలా! ఇంకా ఎంతోమంది జనం కూడా వచ్చి ఏడ్చారుగా, బామ్మా! అట్లాగే ఇప్పుడు కూడా ఆ చచ్చిన బిచ్చగాళ్లని చూసి ఏడ్చి రావద్దూ! ఈపాటికి జనమంతా వచ్చేసే ఉంటారు" అంటూ చుట్టూ చూడసాగాడు.

"అయ్యో రామ! నీ కిదేం పిచ్చిరా! ఆ వైపు బండి వెళ్లదురా! నిన్న గాలివాన మూలంగా




రోడ్లన్నీ నీళ్లతో మునిగిపోయాయి. ఎటు పోవాలో తెలియకుండా ఉంది. మా నాయనగా! చక్కగా చెరువు గట్టునే పోదాం. చెరువులో ఎన్నో తామరపూలు ఉన్నాయి. దారిలోనే కొత్తగా కట్టిన దేవాలయం ఉంది. ఎన్నో రంగురంగుల బొమ్మలు దాని మీద చెక్కారు. భలేగా ఉన్నాయిలే, చూపిస్తాగా! నా మాట విను, నాన్నా! మా గోపీ బంగారుకొండ కాదురా! కోటీ!'' అంటూ కోటయ్యతో నరసమ్మగారు గోపీ రేపిన విషయాన్ని మరిపించ ప్రయత్నించింది.

"నాకవన్నీ ఏం అక్కర్లేదు. నేను సంతలో పడ్డ ఆ చెట్టునీ, చచ్చిన ఆ బిచ్చగాళ్లనీ చూడాల్సిందే! ఒరేయ్ కోటీ, నువ్వు బండిని అటే మళ్లించరా! మా బామ్మ ఊరుకోక ఏం చేస్తుందో చూస్తాను!" అని మంకు పట్టుదలతో కోటయ్యను ఉసిగొల్పి రెచ్చగొట్టాడు గోపి.

వస్తుత: గోపీ చాకులాంటివాడు. సన్నగా, నాజూగ్గా ఉంటాడు. ప్రతిదీ విమర్శ చేస్తున్న ట్లుంటాడు. ఆరాలూ, కూపీలూ తీయటమంటే శ్రద్ధాసక్తులు కలిగినవాడిలాగా ఉంటాడు. చూసి ఊరుకోవటం, చేతకాకనో ఏమో ఆరిందాగా వాగుతాడు. గట్టిగా పదేళ్లు కూడా లేవు.

సహజంగా వయసు మళ్లిన వాళ్లకీ, పసివాళ్లకీ ఎప్పుడైనా అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు 'చిన్నతనం కదూ, పోనీలే!' అని వాళ్ల మాటనే నేరుగా నెగ్గేలా చేయటం పెద్దవాళ్ల పట్ల ఎలా జరుగుతూ ఉంటుందో, చూసీ చూడకుండా, సరిగ్గా అలాగే ఇప్పుడు కూడా ఈ గోపీ, ఆ అరవై సంవత్సరాలు దాటిన నాయనమ్మ వరాల మాటల్ని తోసిరాజన్నాడు. గోపీని నరసమ్మగారు ఏ పరిస్థితులలో పెంచుకుంటూ వస్తోందో అవగాహన చేసుకున్నవాళ్లంతా తప్పకుండా ఆ బామ్మ, ఆ ముద్దుల మనవడి ఉత్సాహవంతుడైన కోర్కెను తీర్చే ఉంటుందని ఊహిస్తారు.

నరసమ్మగారు మాంచి వయస్సులో ఉండగా, లేక లేక, భగవంతుని దయ వలన ఎనిమిదేళ్లకి సంసార సుఖానుభూతి ఫలితంగా ఒక మగ శిశువును కన్నది. భర్త ఉబ్బసపు వ్యాధితో తీసుకుని తీసుకుని మూడేళ్లకు మరణించాడు. అప్పుడు నరసమ్మగారికి ఏడుపు తప్ప మరేదీ శరణ్యం కాకపోయింది. పిదప ఆ పసికందుని గుండెల్లో పెట్టుకుని విధివశాత్తూ ప్రాప్తించిన వైధవ్యాన్ని అనుభవిస్తూ, ఎండ కన్నెరగకుండా ఎంతో గుండె నిబ్బరంతో దిక్కుమాలిన జీవితాన్ని గడుపుతూ, కన్న నలుసుకి పట్టెడన్నం పెట్టుకుంటూ, కటిక చీకటిలో బాధామిళిత స్వాంతంతో, లేనిపోని ఆలోచనలతో పెంచి పెద్ద చేసుకుంటూ వచ్చింది.

కొడుక్కి యుక్త వయస్సు వచ్చేసరికి, చదువు కాస్తా పూర్తయింది. పెళ్లి చేసి, చక్కని కోడల్ని తెచ్చుకుంది. ఆస్తినీ, బాధ్యతల్నీ ఇహ కొడుక్కీ, కోడలికీ ఒప్పగించి, తాను 'కృష్ణా రామా' అనుకుంటూ కాటిలో ఒక కాలూ, ఇంట్లో ఒక కాలూ ఉంచుదామనుకుంది నరసమ్మగారు. ఇంతలో ఆమె కోడలు పారిజాతం - సంవత్సరం తిరగకముందే అతి కష్టంమీద ఈ గోపీని కని, బలవంతంగా ఒప్పగించి, తన బాధ్యతా, ఋణమూ రెండూ తీరిపోయినట్లుగా మరో లోకానికి వెళ్లిపోయింది.

మళ్లా దు:ఖసాగరం నరసమ్మగారి హృదయంలో పొంగింది. ఆమె కుమారుడు, భార్యా మరణంతో పిచ్చెత్తినట్లయ్యాడు. నరసమ్మగారు తిరిగి ఎలాగైనా సరే కొడుక్కి రెండో పెళ్లి చేయాలనుకుంది. అతడు అందుకు తిరస్కార భావాన్ని వెలిబుచ్చాడు. నరసమ్మగారు పాపం! ఎన్నోవిధాలుగా చెప్పి చూసింది. ప్రయోజనం లేకపోయింది. పైగా కొడుకు తల్లితో వెర్రిగా, వేదాంతిలా వాగడం ప్రారంభించాడు. 'పారిజాతం ప్రేమ వల్లరి తెగటంతోనే నరసమ్మగారి కొడుకు కృష్ణానందం పిచ్చివాడైనాడ'ని బంధువర్గమంతా గుడ్డిగా ప్రచారం చేసింది.

నిజమే. అతనికి అతి వాగుడుతో మతి చలించింది. ఊరి ఒత్తిడికి తాళుకోలేక, బంధువర్గం వారి వెక్కిరింపులను సహించలేక నరసమ్మగారు వెంటనే కొడుకుని విశాఖపట్నం పిచ్చాసుపత్రిలో చేర్పించింది.

మళ్లీ తిరిగి నరసమ్మగారు పుట్టెడు దు:ఖాన్ని దిగమింగింది. ఈ పసికందుని సాకుతూ, ఆస్తి వ్యవహారాలు చూసుకుంటూ ఉంటోంది. భరించలేని ఆవేదనలెన్నో ఆమెను నులిమివేయసాగాయి. ఏం చేయగలదు? మగ దిక్కు లేనప్పుడు ఆడది ఎన్ని వ్యవహారాలని చక్కదిద్దుకోగలుగుతుంది? మాటలా... మగవాడు లేకుండా బతకడమంటేనూ! జీవితం ఇంత బాధావహంగా ఉంటుందని ఇదివరకెన్నడూ నరసమ్మగారు ఊహించలేదు.

వయస్సు ఉడుగుతున్నకొద్దీ, అనుభవాలు పెరుగుతూ ఉంటాయి. పసివాడికి పోషణ కుంటుపడకుండా శాయశక్తులా పగలనక రేయనక పాటుపడుతోంది. ఒంటరిగా ఉన్నప్పుడల్లా చంటి గోపీ నిద్రపోతూ ఉండేవాడు. నరసమ్మగారికి వాడు నిద్రించినంతసేపూ ఏ పనీ చేయడానికి తోచేది కాదు.

అప్పుడు పిచ్చెక్కిన కృష్ణానందం, పసుపు కుంకుమలతో వెళ్లిపోయిన పారిజాతం తలపుకొచ్చేవారు. గుండె చెరువయ్యేది. గుట్టుగా విలపించక తప్పేది కాదు. కొంతసేపటికి గోపీ లేచి కూర్చునేవాడు. నరసమ్మగారి పోయి అమాంతంగా హృదయానికి హత్తుకుని కొంత పరివేదననూ, విషాదాన్నీ మరిచిపోగలిగేది.

"తానే పోయి, తన కొడుకే కులాసాగా ఉంటే ఎంత బాగుండేదో?" నిత్యమూ రకరకాలైన భావాలు ఆమెలో ఉద్భవించేవి. అవన్నీ చంటివాడైన గోపీకేం తెలుసు?

నరసమ్మగారు వీటన్నిటినీ క్రమక్రమంగా విస్మరిస్తూ గోపీని సాకుతూ రాసాగింది. తాను అనుభవిస్తున్న అనంతమైన దు:ఖాన్నీ, తన గుండెల మీద రగిలే కుంపటినీ ఆ పసిగుండెకి తెలియపరచకుండా నరసమ్మగారు జాగ్రత్తగా రోజుల్ని నెట్టుకొస్తోంది.

ఇలాంటి సమయంలో ఒకసారి పారిజాతం చెల్లెలు నిర్మల, భర్తతోపాటు నరసమ్మగారింటికి వచ్చింది. తన అక్క పోవటమే గాక, బావగారికి పట్టిన దుస్థితికి సానుభూతీ, సంతాపమూ చూపింది. గోపీని తన పిల్లలతో సమానంగా పెంచి, పెద్ద చేస్తానని మాటంది. కానీ, నరసమ్మగారికి గోపీని పంపబుద్ధి కాలేదు. వాణ్ణి చూసుకునే కదా నరసమ్మగారికి రోజు గడిచేది! ఎట్లా? గోపీని వాళ్లకిచ్చి ఆమె ఉత్త చేతులతో బతకగలదా? అందుకే ఇవ్వడానికి మనసొప్పలేదు నరసమ్మగారికి.

తను ఎలాగైనా సరే, ఈ గోపీ ఆటపాటల్లో మనసు కలిపి పాల్గొంటూ తన కష్టాల్ని మరిచి

పోవాలనుకుంది. 'గోపీ తన దగ్గర లేనినాడు దుఃఖం తప్ప తనకు నిత్యమూ ప్రత్యక్షమయ్యే దేముంది? అసలు ఈ లోకంలో ఇక తానెందుకు ఉప్పు బొమ్మలాగా! చావటం మేలు.'

నరసమ్మగారికి గోపీమీద మమకారం దినదినాభివృద్ధి కాసాగింది. ఒకవేళ గోపీని, పరిస్థితుల ఒత్తిడికి తాళలేక వాళ్ల పిన్ని నిర్మల వద్దకు పంపితే తన గతేమిటి? నరసమ్మగారు విచిత్ర హృదయంతో అనుకుంది. ఏముంది? ఈ గుప్పెడు మనసు కాస్తా కుమిలి కుమిలిపోతుంది. అలసిన గుండెలమీద బరువెక్కిన కుంపటి ప్రజ్వలిస్తుంది. కళ్లు కందేలాగా ఏడుస్తూ ఉంటాయి. ఇవేవీ భరించడం చేతకాకపోయిన మర్నాడు, గుండె కాస్తా చివరకు ఆగిపోతుంది. ఉప్పు బొమ్మ కాలవైపరీత్యానికి కరిగిపోతుంది.

కానీ, ఆ రోజు ఉదయం గాలివాన తగ్గిన మర్నాడన్నమాట - తన రెండెడ్ల బండిమీద గోపీని, నిర్మల పిన్నింటి వద్ద దింపి వెడదామని నరసమ్మగారు వెంటబెట్టుకొస్తూ ఉంది.

వాన గాలి జోరుగా వీస్తోంది. ఊరంతా ఇసుకతో మేటవేసుకుపోయింది. పొలాలన్నీ నీటిమయమైపోయాయి. అధికంగానే పశు నష్టమూ, పంట నష్టమూ అయింది. గొడ్లసావిళ్లు ఫెళఫెళమని కూలడంతోనే పలుపులు తెంపుకుని బయటపడ్డ పశువులు ఏమయ్యాయో? ఎక్కడ తల దాచుకుని ప్రాణాల్ని కాపాడుకున్నాయో? ఊరేమైందో ఎవరికీ తెలియదు. చిన్న చిన్న పూరి గుడిసెలన్నీ నేలమట్టమయ్యాయి. గడ్డివాములు నీటిపై తేలియాడుతున్నాయి. మట్టి కొంపలు వాన నీటికి కరిగి ఒరిగాయి. ముఖ్యంగా పాడి గేదెలు కనిపించటంలేదు. ఇవన్నీ సరి చూసుకొనేటప్పటికి దాదాపునెల రోజుల దాకా పడుతుంది కదా! అంతవరకూ గోపీకి ఏ లోటూ, లోపమూ లేకుండా పోషణ ఎట్లా జరుగుతుంది? ఎవరు చేస్తారు ఆ పసి వెధవకి? నరసమ్మగారికి పాలుపోలేదు. ఏం చేయాలో తోచలేదు. ఇటువంటప్పుడు 'నా' అనే మగదిక్కు లేకపోతే నరసమ్మగారిలాంటి స్త్రీ ఏమంటూ సాహసం చేసి ఈ పొలాల్నీ, ఈ పశువుల్నీ, ఈ పంటనీ కాపాడుకోగలుగుతుంది? గోపీలాంటి గారాల కూచికి పోషణ ఎట్లా చేస్తుంది?

అందుచేతనే దగ్గర్లో ఉన్న నిర్మల ఊరికి నరసమ్మగారు గోపీతో బయలుదేరింది. బండ్ల దారంతా రొచ్చుగానూ, బురదతోనూ, నీళ్లతోనూ నిండిపోయి ఉన్నా, కోటిగాడు బండిని చురుగ్గానే తోలుతున్నాడు.

కోటిగాడు నరసమ్మగారి చిన్న పాలేరు. కోడెప్రాయంపుటందగాడు. ముగ్గురూ ఉప్పెన వెలిసిన తరువాత కొత్త లోకానికి వెడుతున్నట్లుగా బయలుదేరారు. గత రాత్రి నుంచి గడ్డి రుచి ఎరుగని బండెడ్లు, బండిని లాగుతూనే తలవంచి, నీటిపైన గాలికి ఊగే గడ్డి మొక్కల్ని మునిపళ్లతో కొరుక్కుతింటున్నాయి. బండి వరదనీటిని ఈదుతూ, సంత బజారు మధ్యకొచ్చేసరికి -

"బామ్మా! అదుగోనే, పడిపోయిన పెద్ద చెట్టు ఆ మూలగా ఉంది, చూశావా! భలేగా ఉందిలే! చూడు, చూడు!" అంటూ గోపీ నరసమ్మగారిని గోల చేశాడు. నరసమ్మగారు ఆ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని కలయచూస్తోంది బండిలో కూర్చుని. కోటిగాడు బండిని ఆపుచేసి, దిగి వెళ్లి, జనంలో కలిశాడు. గోపీ బండి తొట్లో నిల్చుని -

"నిజంగా చెట్టంతా పడిందే, బామ్మా! చచ్చిపోయిన వాళ్లంతా అక్కడక్కడా ఉన్నారేం?' ' వింతగా ప్రశ్నించాడు.

"అదంతా నీ కెందుగ్గానీ కోటిగాడ్ని పిలు, పోదాం. వర్షం కూడా మళ్లా వచ్చేట్టుగా ఉంది." నరసమ్మగారు ఆ సంభాషణని తుంచేసింది.

కానీ గోపీ వినిపించుకోలేదు. సంత బజారు మూలలో పెద్ద చెట్టొకటి నిజంగానే పడింది. దాని కింద అనాథ జీవుల శవాలు రూపరహితంగా పడి ఉన్నాయి. ఎవ్వరూ 'నా' అంటూ శోకించటంలేదు. మరెవ్వరూ 'మా' అంటూ పరితపించటంలేదు. జాలీ, దయా, సానుభూతీ పల్చ పల్చగా కొందరిలో ఉదయించాయి. జనం గుంపులు గుంపులుగా చేరి పనికిరాని కబుర్లు చెప్పుకుంటున్నారు.

గోపీ చూస్తున్నాడు.

ఎవ్వరూ ఎందుకు ఏడవడంలేదో అర్థం కావటంలేదు.

ఆనాడు తన ఊళ్లో మోటబావి దగ్గర అంతమంది జనం, తనూ, బామ్మా కూడా శకుంతలత్తయ్య చచ్చిపోయినప్పుడు ఎందుకేడ్చినట్లు? గోపీ లేత హృదయంలో సందేహంగా ఈ ప్రశ్న కలిగింది.

"బామ్మా!"

నరసమ్మగారు గోపీవంక చూసింది.

"అంతమంది చచ్చిపోతే ఎవ్వరూ ఏడవనన్నా ఏడవరేమి?"

గోపీ ప్రశ్నకి నరసమ్మగారు నివ్వెరపోయింది.

"మరి... మన ఊళ్లో శకుంతలత్తయ్య పోతే మనమంతా కూడా జనంతోపాడు ఏడ్చాంగా!"

మళ్లీ ఆ కుర్ర సన్నాసి వేసిన ప్రశ్నకి నరసమ్మగారు నోరు మెదపలేకపోయింది.

"శకుంతలత్తయ్యలాగా వీళ్లు నూతిలో పడి చచ్చిపోలేదని ఏడవటంలేదా?" నరసమ్మగారు గోపీ వేసే ప్రశ్నలకు మెలికలు తిరిగిపోసాగింది.

"అయితే ఎవరైనా సరే, నూతిలో పడి ఛస్తేనే ఏడవాలన్నమాట! అర్థమైంది, బామ్మా!"

నరసమ్మగారి మనస్సు కరిగిపోతోంది. మతి చలిస్తోంది.

"అంతేనా, బామ్మా!" తనకి తనే తేల్చుకుని అన్నాడు.

నరసమ్మగారు ఆ మాటలకి ఊగిపోయి, "గోపీ! ఇక ఊరుకోరా!" అంటూ దగ్గరకు లాక్కుని ఒళ్లో కూర్చోబెట్టుకుంది. వెంటనే ఆమె కోటిగాడ్ని కేకవేసింది. వాడొచ్చి బండెక్కి, ఎడ్లనదిలించాడు. రేవడి మట్టి రోడ్డు మీదుగా బండి బాధగా కదిలింది.

లేకపోతే, గోపీ తనని ఇంకా అలాంటి అవకతవక ప్రశ్నలతో కకావికలపరుస్తాడని భయపడింది నరసమ్మగారు.

బండి ఫర్లాంగు దూరం వెళ్లాక, ఎదురుగా మునెమ్మ మెత్తని గడ్డి మోపెత్తుకుని అమ్మకానికొస్తూ ఎదురైంది. కోటిగాడునరసమ్మగారికి వినబడీ వినబడకుండా ఈల వేస్తూ -

"మోపెంత, మునెమ్మా?" అనడిగాడు.

మునెమ్మ పచ్చగడ్డి కొసల సందుల్లోంచి ఓరగా చూస్తూ దోరగా నవ్వింది. కోటిగాడిలో యౌవనం బుస కొట్టింది. చటుక్కున మెడ వెనక్కి తిప్పి, "అమ్మగారూ! గడ్డిమోపేయించుకుందామా?" అనడిగాడు నరసమ్మగారిని.

"ఆ యబ్బాయెవరూ, కోటయ్య మామా?" అంది మునెమ్మ ఇంతలో గోపీవంక చూస్తూ.

గోపీ పళ్లికిలిస్తూ మునెమ్మ వంక చూసి, "ఈ



అమ్మాయీ చచ్చిపోయిందా?'' అనడిగాడు పుసిక్కిన.

కోటిగాడికి బండి జల్లంత నవ్వొచ్చింది. మునెమ్మకి చిక్కని కోపం వచ్చి ఒక్క చూపు చూసింది. గోపీ పకపకా నవ్వుతూనే ఉన్నాడు.

కోటిగాడు మునెమ్మని చూసన్తా, "సిన్నతనంలే, మునెమ్మా! అలా సూడకు, దడుసుకుంటారు మా గోపయ్యగోరు. కాస్తూరుకో!' ' అని తన నవ్వుని తగ్గించుకున్నాడు.

నరసమ్మగారికి కోపం వచ్చింది. "ఊరుకో, గోపీ! అందర్నీ అలా అనొచ్చా? తప్పు కాదూ!" అంది.

"అయితే నేనే అనుకుంటాను." మొండిగా అన్నాడు గోపీ.

"నువ్వేమీ అనుకోవద్దులే." నరసమ్మగారు వారించింది.

'ఊహుఁ, అనుకుంటాను. ఏం చేస్తావేమిటి?' నరసమ్మగారిని బెదిరించాడు. ఆమె గోపీని సముదాయించలేకనూ, మందలించలేకనూ తికమక పడుతోంది.

గోపీ ఆమె ఒళ్లోంచి లేచి, "నే నెప్పుడు చచ్చిపోతాను, బామ్మా!" అనడిగాడు నిశ్చలంగా చూస్తూ.

వాడి చూపుకి ఆమె భయపడింది.

"ఊరుకోరా, నాయనా!'' ఆందోళనగా బతిమిలాడుతూ అంది.

"అప్పుడు అందరూ వచ్చి ఇందాకటి మాదిరిగా చూస్తారా, బామ్మా!''

మునెమ్మకి ఈ ప్రశ్నలేమీ అర్థం కాక కోటిగాడివంక చూసింది. వాడు బేరం తేల్చకపోయేసరికి మునెమ్మ మోపుతో సంత వైపు దారి తీసింది.

"బామ్మా! నేను ఎప్పుడు చచ్చిపోతే ఇంతమంది జనం వస్తారే?'' నరసమ్మగారిని చిత్రవధ చేసినట్లుగా అడిగాడు.


"గోపీ! అలాంటి మాటలడక్కురా. నువ్వేమీ చచ్చిపోవురా! అలా మాట్లాడకురా!'' రుద్ధకంఠంతో గింగిరాలు తిరిగిపోతూ అంది నరసమ్మగారు.

"కాదు... నేను చనిపోతానే అనుకో, బామ్మా! అప్పుడు నన్నేం చేస్తారు? శకుంతలత్తయ్యని ఊరేగించినట్లు నన్నూ ఊరేగిస్తారా? బిచ్చగాళ్లని లారీలోకి ఎక్కించినట్లు నన్నూ ఎక్కిస్తారా? ఏం చేస్తారే? పదిమందీ వస్తారా?''

"అబ్బబ్బ! అసలు నువ్వు చావవంటుంటేనూ! మళ్లీ అదే ప్రశ్నని అడుగుతావేంరా? కాసేపు నోరు మూసుకుని పడుండలేవూ! మరీ గడుగ్గాయివైపోతున్నావురా గోపీ!'' నరసమ్మగారు ఓర్పు నశించటంతో విసుక్కుంది.

"నేనూరుకోను, బామ్మా! నువ్వు చెప్పాల్సిందే!' ' గోపీ మారాం చేస్తూ నరసమ్మగారిని కంగారు పెట్టేశాడు. ఆమెకేం తోచక ఊరుకుండిపోయింది. ఎన్నో వియుక్తాలోచనలు ముసురుకున్నాయి.

బండిని త్వరత్వరగా తోలమని నరసమ్మగారు కోటిగాడ్ని హెచ్చరించింది. వాడు ఎడ్లనదిలించాడు




వాటి తోకల్ని మెలిపెడుతూ.

బండి తడి మట్టిమీద తూలుతూ పోతోంది.

'గోపీలో ఇంత చురుకుదనమూ, ఇన్ని అతి తెలివి తేటలూ, ఇంతింత పెద్దపెద్ద మాటలూ, ఇన్ని ఊహలూ, భావాలూ ఆ భగవంతుడు ఎలా పొదిగాడో? చచ్చిపోవటమంటే వాడికేం తెలుసుననీ అలా అంటాడు. చచ్చిపోతేనే ఇంతమంది జనం చేరుతారని అనుకుంటున్నాడేమో? పసి వెధవకి ఇలాంటివన్నీ చూపడం న్యాయం కాదేమో!' - నరసమ్మగారికి అర్థం కాలేదు గోపీ మనస్తత్వం ఆ సమయంలో. ఆమెకు గోపీ ఊహాతీతుడయ్యాడు.

బండి సాగి సాగి, నిర్మల ఇంటిముందుకొచ్చి ఆగింది. వీళ్ల యోగక్షేమాల కోసం ఆందోళన పడుతున్న నిర్మల దంపతులు, హఠాత్తుగా వచ్చిన నరసమ్మగారినీ, గోపీనీ చూసి సంతోషించారు.

ఉభయకుశలోపరి అయిన పిదప, నరసమ్మగారు తిరిగి బండెక్కుతానంది. నిర్మల దంపతులు ఆ పూటకి ఉండమని కోరారు. "కాదు, అవతల చాలా పనులున్నాయి'' అని చెప్పి తిరుగు ప్రయాణం కట్టింది నరసమ్మగారు. వెడుతూ నిర్మల దంపతుల వంక చూస్తూ, "జాగ్రత్త, గోపీని ఏమనకండి!'' అని మరీ చెప్పి వీధి గుమ్మం వరకూ వచ్చింది.

నిర్మల గోపీని ఎత్తుకుంటూ, "మా రాధిగాడికన్నా వీడు తెలివిగలవాడే, అత్తయ్యా!'' అంది నరసమ్మగారితో.

"నేనూ అదే అనుకుంటున్నానే, నిర్మలా! కానీ, అతి తెలివి మితిమీరిపోతోందేమో అని నాకు అనుమానంగా ఉంది'' అంది మెల్లగా నరసమ్మ గారు.

''అయితే వీడికి చదువు దిట్టంగా వస్తుందన్నమాట!'' నిర్మల భర్త మోహనరావు నవ్వుతూ అన్నాడు.

"ప్రతిదీ వీడికే కావాలోయ్, మోహనరావు! చూసిందల్లా పెద్ద ఆరిందాలాగా విమర్శిస్తాడు. ఒక్కొక్కసారి ఏమిటో వెర్రిగా మాట్లాడతాడు. అదేమైనా పిచ్చేమో అనిపిస్తోంది. ఇదివరకే నయం, చెప్పిన మాట వినేవాడు. మరీ ఈమధ్య వినకుండా రెచ్చిపోతున్నాడు. ఏమన్నా అనడానికా, నోరు రాకుండా ఉంది. చెయ్యి చేసుకుందామా - చంటి వెధవ! ఏమీ చెయ్యలేక ఊరుకోవాల్సివస్తోంది.'' నరసమ్మగారు ఇదంతా గోపీవంక చూస్తూనే అంది. ఇంతలో గోపీ రాధిగాణ్ని చూసి నిర్మల ఒళ్లోనుండి జారిపోయి, బూటుకాళ్లతో వర్షానికి తడిసిన మెట్లమీదుగా మేడెక్కటం మొదలుపెట్టాడు.

"చూశావా, నిర్మలా! ఇక అదీ వాడి అల్లరీ ఆగమూనూ!'' అని చూపిస్తూ, "ఒరేయ్ గోపీ! నెమ్మదిగా ఎక్కు, జారి పడతావు. కింద నాపరాళ్లు కూడానూ! పడ్డావంటే దెబ్బతో ...'' ఇక నరసమ్మగారు అనలేకపోయింది. మామూలు మాటగా వచ్చేసేదే - 'ఛస్తావు' అని. కానీ అంతలోనే మేల్కొని ఆ మాటని ఆపుకోగలిగింది. ఇంతలో కోటిగాడు బండి మూసి, నరసమ్మగారిని పిలిచాడు. ఆమె మెల్లగా కదిలి బండెక్కింది. ఒక్కసారి మేడ మీదికి చూసింది. రాధిగాడితో గోపీ ఆడుకుంటూ మధ్యమధ్య పడటం కనిపిస్తూనే ఉంది.

నిర్మల వీడ్కోలిచ్చిన అనంతరం నరసమ్మగారి బండి ఆ ఊరి పొలిమేర దాటింది. ఆమె మనసూ, దృష్టీఅంతా మనవడు గోపీ మీద లగ్నమై ఉన్నాయి. కోటిగాడు, పాత దారినే బండిని తోలుకొస్తున్నాడు. బండి ఉండి సంతబజారు దాటింది.

అప్పటికి జనం గుంపు కాస్త పల్చబడింది. పచ్చగడ్డి మోపెత్తుకుని బేరం కోసం మునెమ్మ అలాగే నిలబడి ఉంది. కోటిగాడు మునెమ్మని పలకరించి సన్నగా కన్ను గీటాడు. మునెమ్మ వయసు గుండె గులాబీ పువ్వులా కందింది. నెత్తిమీద మోపుకి బేరం ఎప్పుడు కుదిరిందో, కోడిగాడే మిచ్చాడో నరసమ్మగారికి తెలియదు. మొత్తానికి బండిలో మునెమ్మ పచ్చగడ్డి మోపుని విసిరేసింది. విసిరేముందు ఎలపటెద్దు మునెమ్మ పమిట కొంగునీ, దాపటెద్దు ఆమె మెడ వంపునీ ముద్దెట్టుకున్నాయి. మునెమ్మ గిలిగింతలతో కోటిగాడ్ని చూస్తూ, "రే పీడే కనిపించు మావోయ్!'' అంటూ తిరిగి తిరిగి చూస్తూ వెళ్లిపోయింది.

ఇంత సందడి జరిగినా నరసమ్మగారికి తెలియలేదు. ఆమె మనసులో గోపీ కనబడుతున్నాడు. చెవుల్లో వాడి మాటలే గొడవ చేస్తున్నాయి. గోడెక్కి బాదంకాయలు కోస్తున్నట్లుగా గోపీని ఊహించుకోసాగింది. గోడపక్కనే పెద్ద నుయ్యి కూడా ఉంది. అందులో కాలు జారి పడిచావడు కదా! అమ్మో!

ఆమె భయపడుతూ, కంగారు పడిపోతూ, వియుక్తాలోచనల మధ్యన పడి నలిగిపోసాగింది.

మళ్లీ తనకి - తన ఉప్పు బొమ్మ జీవితానికి - తన గోపీ నవ్వుతూ, కేరింతలతో కనిపిస్తాడో, లేదో.

నరసమ్మగారి గుండెలు బెంగతో అలిసి, సొమ్మసిల్లిపోయేసరికి కోటిగాడు తోలుకొస్తున్న బండి కుదుపులతో ఇంటిముందుకొచ్చి, ఒక్క నిట్టూర్పు పెద్దగా, భారంగా విడిచినట్లు ఆగింది.